# సాక్షి మంచిర్యాల

శనివారం । 1 । ఏప్రిల్ । 2023






**విజయం 'పది'లం చేసుకోండి**

ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమైతేనే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ఈ నెల 3 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 8లో▸




**ప్రాచీన కళలు దాగి ఉన్న నెన్నెల**

నెన్నెలలో ఎన్నో ప్రాచీన కళలకు సంబంధించి పురాతన వస్తువులు దాగి ఉన్నాయని ప్రొఫెసర్ జయధీర్ తిరుమల్‌రావు అన్నారు. ప్రొఫెసర్ బృందం మండలంలో పర్యటించింది. 10లో▸

గరిష్టం/కనిష్టం
37.0 /24.0

**వాతావరణం**

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా వడగాలులు వీస్తాయి.




## న్యూస్‌రీల్

### రాష్ట్ర ఉత్తమ పంచాయతీగా గొల్లపల్లి



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ శశికళ

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి ఉత్తమ గ్రామ పంచాతీయ పురస్కారం దక్కింది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా జాతీయ స్థాయి దీన్‌దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారానికి సర్పంచ్ ఇందూరి శశికళ అందుకున్నారు. సామాజిక భద్రత అంశాన్ని పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర పురస్కారం అందజేయడంతోపాటు జాతీయ అవార్డుకు నామినేట్ చేశారు. అదనపు కలెక్టర్ రాహుల్, జెడ్పీ సీఈఓ కాకిరాల నరేందర్, డీపీఓ వెంకటేశ్వర్లు శశికళను అభినందించారు.

**ఉత్తమ మండల సమాఖ్యగా బెల్లంపల్లి**

పాతమంచిర్యాల: ఉత్తమ మండల సమాఖ్యగా బెల్లంపల్లి మండల సమాఖ్య అవార్డుకు ఎంపికైంది. రాష్ట్రంలో 2వ ఉత్తమ మండల సమాఖ్యగా శుక్రవారం అవార్డు అందుకుంది. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో అవార్డులను రాష్ట్ర శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయ చేతుల మీదుగా మండల సమాఖ్య అధ్యక్షురాలు కొలిపాక స్వప్న అవార్డు అందుకున్నారు. 150 శాతం స్త్రీనిధి రుణాలు అందించి రికవరీ చేసినందుకు సెర్ప్ అధికారులు అవార్డుకు ఎంపిక చేశారు.

### పంట నష్టపోయిన రైతులకు పరిహారం

- క్షేత్రస్థాయి సర్వే నివేదిక అందించాలి
- విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



బడిని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

మంచిర్యాలఅగ్రికల్చర్: మార్చి 16నుంచి 21వరకు జిల్లాలో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా ఉద్యానవన అధికారి వి.ఉదయ్‌కుమార్‌తో కలిసి వ్యవసాయ, విస్తరణాధికారులతో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున నష్టపరిహారం అందించేందుకు సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో వ్యవసాయ, విస్తరణాధికారులు, ఉద్యావన శాఖ అధికారులు సమన్వయంతో విచారణ జరిపిన నివేదిక, అర్హుల జాబితా ఆదివారం సాయంత్రంలోగా అందించాలని ఆదేశించారు. జాబితా రూపొందించడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రభుత్వ బడిలోనే మెరుగైన విద్య**

దండేపల్లి: ప్రభుత్వ బడిలోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. 'మన ఊరు–మనబడి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాలలో రూ.20లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, సర్పంచ్ మాధవి, ఎంపీటీసీ కమలాకర్, ఎంపీడీవో మల్లేశం, ఎంఈవో రవీందర్, నోడల్ అధికారి సత్యనారాయణ, డీటీ విజయ, కాంప్లెక్స్ హెచ్ఎం జయప్రద పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఒకేషనల్ పరీక్షలు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం ఒకేషనల్ విభాగం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జికోర్సు గణితం పరీక్షలు నిర్వహించారు. ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు 937 మంది విద్యార్థులకు గాను 836 మంది హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను డీఐఈవో శైలజ తనిఖీ చేశారు.

# ఆదాయం అదరహో!

- జిల్లాలో ఈ ఏడాది రాబడిలో వృద్ధి
- 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపు
- నేటి నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలు
- జిల్లా నుంచి రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టే పలు విభాగాల్లో గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రాబడి పెరిగింది. జిల్లాలోని ఆయా శాఖల నుంచి రాష్ట్ర ఖజానాకు రూ.కోట్లలోనే అందిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం శుక్రవారం నాటితో ముగిసింది. శనివారం నుంచే కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి మార్చి 31వరకు పరిగణనలోకి తీసుకుంటారు. ఈ లెక్కన గత ఏడాది కంటే జిల్లాలో ఆయా శాఖల ఆదాయం పెరుగుతూ వస్తోంది.




మంచిర్యాల సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు

వీటిలో ప్రధానమైన ఆబ్కారీ, వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణాశాఖ, గనుల శాఖ ప్రధానమైనవి. ఈ శాఖల్లో అన్నీ గతంకంటే వృద్ధిని నమోదు చేశాయి.

### రిజిస్ట్రేషన్లు అదుర్స్

కరోనా తర్వాత క్రమంగా రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడంతో రిజిస్ట్రేషన్లు పెరిగాయి. ఎల్ఆర్ఎస్ కొంత కాలంగా తక్కువగా జరిగినా మళ్లీ వృద్ధి పెరిగింది. జిల్లాలో మంచిర్యాల, లక్సెట్టిపేట పరిధిలో రెండు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు ఉన్నాయి. వీటి పరిధిలో స్టాంపుల అమ్మకం, రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్లు, తదితర లావాదేవీలు జరుగుతున్నాయి. ఏటేటా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ రాబడి పెంచుతూ పోతోంది.

| ఆర్థిక సంవత్సరం | రిజిస్ట్రేషన్లు | ఆదాయం( రూ.కోట్లలో) |
|---|---|---|
| 2021–22 | 18,142 | రూ.45.42 |
| 2022–23 | 22,145 | రూ.62.08 |

### మద్యంతో ఆదాయ కిక్కు



ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి జిల్లాలో మద్యం అమ్మకాల్లో వృద్ధి పెరిగింది. ఐఎంఎల్(ఇండియన్ మేడ్ లిక్కర్) కాకుండా బీర్లు అధికంగా విక్రయించడం గమనార్హం. జిల్లాలో 73వైన్స్‌లు, 17బార్లు ఉన్నాయి. వీటిలో ఈ ఏడాది నాలుగు బార్లు అమ్మకాలు లేక మూతపడ్డాయి. మిగతా వాటిలో ఈ ఆర్థిక సంవత్సరంలో సగటున నెలకు రూ.56కోట్లు మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఐఎంఎల్ అమ్మకాలు తగ్గుతూ బీర్ల అమ్మకాలు పెరుగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.670కోట్ల వరకు జిల్లాలో ఆబ్కారీ శాఖ అమ్మకాలు జరిపింది.

**జిల్లాలో మద్యం అమ్మకాలు**

| ఆర్థిక సంవత్సరం | ఐఎంఎల్ కేసులు | బీర్ కేసులు | అమ్మకం విలువ |
|---|---|---|---|
| 2021–22 | 7,60,598 | 8,15,034 | రూ.636.99కోట్లు |
| 2022–23 | 6,69,543 | 10,38,683 | రూ.676.69కోట్లు |

### లక్ష్యాన్ని దాటిన రవాణా శాఖ

జిల్లా రవాణా శాఖ పరిధిలో ఉన్న వాహనాలకు త్రైమాసికం, జీవిత కాలపు, ఫీజులు, సేవ ప న్ను, తనిఖీలు, జరిమానాలతో ఏటా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. గతేడాది కంటే ఈ ఆర్థిక సంవత్సరంలో వాహనాల రిజిస్ట్రేషన్లు సైతం పెరిగాయి. పన్నుల విలువ సైతం పెరగడంతోనూ ఆదాయం పెరిగింది. జిల్లాలో ఇటీవల వాహనాల కొనుగోళ్లు పెరుగుతూ వస్తున్నాయి. గతేడాది జిల్లా రవాణా శాఖకు రూ. 43.71కోట్లు రాగా, ఈ ఏడాది రూ.61.24 కో ట్లు సమకూరింది. ఈ ఏడాది లక్ష్యం కంటే అధికంగానే పన్నుల వసూళ్లు అయ్యాయి.

**రవాణా శాఖ ఆదాయం**

| ఆర్థిక సంవత్సరం | పన్నుల లక్ష్యం | వసూళ్లు |
|---|---|---|
| 2022–23 | రూ.55.86కోట్లు | రూ.61.24కోట్లు |

జిల్లాలో వాహనాల రిజిస్ట్రేషన్లు

| | | | |
|---|---|---|---|
| 2021–22 | 10,010 | 2022–23 | 10,730 |

### పన్నుల వసూళ్లు భేష్



రాష్ట్ర ఖజానాకు ఆదాయం తెచ్చిపెట్టే మరో కీలకశాఖ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ.. జిల్లా నుంచి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. రాష్ట్ర వస్తు, సేవల పన్ను(ఎస్జీఎస్టీ) అమ్మకపు పన్నుల, జీఎస్టీ, వ్యాట్, వ్యాపారుల డీలర్‌షిప్‌ల లైసెన్స్‌లు, రెన్యూవల్, పన్నుల చెల్లింపులు, జరిమానాలతో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఫీజులు వసూలు చేస్తుంటారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో గతేడాది కంటే 35శాతం అధికంగా పన్నులతో ఆదాయం వచ్చింది.

| ఆర్థిక సంవత్సరం | పన్నుల వసూళ్లు |
|---|---|
| 2022–23 | రూ.44.28కోట్లు |
| 2021–22 | రూ.32.70కోట్లు |
| పెరుగుదల | 35.42శాతం |

### యువత అభివృద్ధి వైపు అడుగులు వేయాలి

- సమస్యల పరిష్కారానికి కృషి
- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



చీరలు పంపిణీ చేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

జన్నారం: యువతీ, యువకులు బాగా చదువుకుని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు పొంది అభివృద్ధి మార్గం వైపు అడుగులు వేయాలని రామగుడం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆలీనగర్ గిరిజన గ్రామంలో జన్నారం పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ మీ కోసం నిర్వహించారు. గ్రామంలోని 300 మంది మహిళలకు చీరలు, యువకులకు క్రీడాసామగ్రి, చిన్నారులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు అందజేశారు. సమస్య ఏదైనా పోలీసుల దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకర్, ఏసీపీ తిరుపతిరెడ్డి, లక్సెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి, జన్నారం ఎస్సై సతీష్, ఆలీనగర్ సర్పంచ్ హన్మంతరావు పాల్గొన్నారు.

**పౌర హక్కులపై అవగాహన ఉండాలి**

మంచిర్యాలక్రైం: ప్రతీ ఒక్కరికి పౌర హక్కులపై అవగాహన ఉండాలని సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీ అంజనీకుమార్ ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రతీ నెల 30న పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో ప్రతీ నెల మొదటి మూడు వారాలు ఆయ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, వార్డుల్లో పోలీస్ అధికారులు సందర్శించి నెల చివరి 30న గ్రామ ప్రజలతో మమేకమై పౌర హక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కులం పేరుతో దూషించడం, భూ వివాదాలు, మహిళలపై అత్యాచారాలు నిరోధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఇక పోషకాల బియ్యం

- ఈ నెల నుంచే రేషన్ దుకాణాల్లో పంపిణీ
- అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లలోనూ..

మంచిర్యాలటౌన్/దండేపల్లి: జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు అన్ని రకాల పోషకాలు ఉన్న ఫోర్టిఫైడ్(బలవర్ధక) బియ్యం పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో పంపిణీ చేస్తుండగా.. ఏప్రిల్ నెల నుంచి మంచిర్యాల జిల్లాతోపాటు నిర్మల్ జిల్లాలోనూ పంపిణీ చేయనుంది. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పేదలు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు, బాలింతలు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి పోషక విలువలున్న బియ్యం అందించనున్నారు. ఇందుకోసం 'ఫోర్టిఫైడ్ బియ్యం యొక్క గుణాలు పొందడి, ఆరోగ్యంగా జీవించేందుకు శక్తులను తీసుకురండి' అనే నినాదంతో ముందుకెళ్తున్నారు.

**వంద కిలోలకు ఒక కిలో**

రేషన్ దుకాణాల ద్వారా ఇప్పటివరకు పంపిణీ చేస్తున్న బియ్యంలో పూర్తిస్థాయిలో పోషకాలు లభించకపోవడంతో పేదల్లో తలెత్తుతున్న అనారోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఏప్రిల్ నెల నుంచి ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. ఫోర్టిఫైడ్ రైస్‌లో సూక్ష్మ పోషకాలైన ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్లు ఏ, బీ1, బీ2, బీ3, బీ6, బీ9, బీ12, డీ, ఈ, మినరల్స్‌ను కలుపుతున్నారు. రైస్‌మిల్లుల్లో బ్లెండెడ్ యంత్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా బలవర్ధక బియ్యం సిద్ధం చేస్తున్నారు. మామూలుగా అందించే బియ్యం వంద కిలోలకు గాను ఒక కిలో పోషకాల బియ్యం కెర్నెల్‌ను కలుపుతారు. దీంతో ఐరన్, సోడియం ఐరన్, ఫోలిక్ యాసిడ్ వంటి పోషకాలు అందుతాయి. ఈ




పోషకాలతో కూడిన బియ్యం బస్తా

ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్లు సమకూర్చుకునేందుకు అవకాశం ఏర్పడనుంది. దీంతో ప్రజల్లో పోషకాహార లోపం తొలగి, రక్తహీనత నుంచి రక్షణ, శరీరంలో అలసట తగ్గుముఖం, నెలలు నిండకుండా ప్రసవం అవడం, బరువు తక్కువగా ఉండే శిశువులు జన్మించకుండా, ఆరోగ్య శిశువులు జన్మించడం, రోగ నిరోధక శక్తి పెరగడంతోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందేందుకు అవకాశం ఉంది.

**అక్రమాలకు అడ్డుకట్టపడేనా?**

గతంలో చౌకధరల దుకాణాల నుంచి బియ్యం పొందిన లబ్ధిదారుల్లో చాలామంది వాటిని తినలేక వ్యాపారులకు విక్రయించేవారు. దీంతో రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగేది. ప్రస్తుతం రేషన్‌కార్డుదారులు అందరికీ పోషకాలతో కూడిన బియ్యాన్ని అందిస్తుండడంతో వినియోగదారులు పూర్తిస్థాయిలో వినియోగించుకుంటే అక్రమ దందాకు కూడా అడ్డుకట్ట పడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**జిల్లా వివరాలు**

| | |
|---|---|
| రేషన్ దుకాణాలు | : 423 |
| కార్డుదారులు | : 2,19,453 |
| ఏప్రిల్ బియ్యం కోటా : | 3080.327 మెట్రిక్ టన్నులు |
| అంగన్‌వాడీ కేంద్రాలు | : 969 |
| కేటాయించిన బియ్యం | : 50 మెట్రిక్ టన్నులు |
| ప్రభుత్వ పాఠశాలలు | : 727 |
| కేటాయించిన బియ్యం | : 63 మెట్రిక్ టన్నులు |

**విటమిన్లు లభిస్తాయి**



గతంలో ఇచ్చిన బియ్యంలో పూర్తిస్థాయి పోషక విలువలు లేకపోవడంతో ప్రతీ వంద కిలోల బియ్యానికి ఒక కిలో పోషక విలువలు కలిపి అందిస్తున్నాం. పేదలు, విద్యార్థులకు సరిపడా పోషకాహారం అంది ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందేందుకు అవకాశం ఉంటుంది. అన్ని రకాల విటమిన్లు ఇందులో లభిస్తాయి. చూడ్డానికి ఫోర్టిఫైడ్ రైస్ కొద్దిగా తేడాగా అనిపించి, ఈ బియ్యాన్ని కడిగితే నీళ్లలో తేలడం వల్ల ప్లాస్టిక్ బియ్యం అనే అపోహ వస్తుంది. అలాంటి ఆలోచన లేకుండా ఈ బియ్యాన్ని వాడడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు.

– ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

# ఎండలు.. జర జాగ్రత్త

- జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ జారీ
- 40డిగ్రీలకు గరిష్ట ఉష్ణోగ్రతలు
- మరో నాలుగు రోజులు భగభగ
- బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనం
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం



నిర్మానుష్యంగా మంచిర్యాల ఎన్టీఆర్ చౌరస్తా

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో నాలుగు రోజులుగా భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. దీంతో జనాలు బయటకు రావడానికి జంకుతున్నారు. వడగాలులు, వేడిమి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రాబోయే నాలుగు రోజులపాటు జిల్లాలో 40 డిగ్రీల నుంచి 45డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 25.3 డిగ్రీలుగా నమోదైంది. ఏప్రిల్, మే నెలల్లో సూర్యప్రతాపం ఎలా ఉండబోతుందోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే ఎండలతో వేడి ప్రారంభమవుతోంది. మధ్యాహ్నం 12గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాయంత్రం ఆరు గంటలు దాటితే గానీ బయటకు రాని పరిస్థితి నెలకొంది. వాహనాలపై వెళ్లేవారు రక్షణగా టోపీ, కళ్లద్దాలు ధరిస్తున్నారు. సింగరేణి బొగ్గు గని ఏరియాల్లో ఎండ వేడిమి మరింత ఎక్కువగా ఉంది. ఓపెన్‌కాస్టుల్లో పని చేస్తున్న కార్మికులు భానుడి ప్రతాపానికి అల్లాడిపోతున్నారు.

**మరో రెండు నెలలు..**

మార్చిలోనే గరిష్ట ఉష్ణోగ్రతలు 40డిగ్రీలకు చేరడంతో ఏప్రిల్, మే నెలల్లో మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత వానాకాలంలో ఎడతెరిపి లేని వర్షాలు, వరదలు ముంచెత్తినట్లుగానే ఈ వేసవిలో సూర్యప్రతాపం కొనసాగుతోంది. పదో తరగతి, డిగ్రీ పరీక్షలు ప్రారంభం కానుండగా పగటి ఎండలతో ఆందోళన చెందుతున్నారు.

**భారీగా పెరిగిన విద్యుత్ వాడకం**

జిల్లాలో పెరుగుతున్న ఎండలతో నీటి లభ్యత రాను రాను తగ్గిపోతోంది. మరోవైపు విద్యుత్ వినియోగం గత ఏడాది కంటే భారీగా పెరిగింది. మార్చి 26న 3.011 మిలియన్ యూనిట్లు, 27న 3.045, 28న 3.063, 29న 3.069, 30న 3.075, 31న 3.083 మిలియన్ యూనిట్ల వినియోగం జరిగింది. ఓ వైపు యాసంగి పంటలకు విద్యుత్ మోటార్ల వినియోగం పెరగడంతోపాటు గృహాలు, కార్యాలయాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా ఏసీలు, కూలర్లు వినియోగిస్తున్నారు. వేసవి తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు కూలర్లు, ఏసీలకు డిమాండ్ పెరిగింది. దోసకాయలు, పుచ్చకాయలు తదితర పండ్ల జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు.

**ఎల్లో నుంచి ఆరెంజ్ జోన్‌లోకి..**

గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలలోపు నమోదవుతే సాధారణం, 35నుంచి 40డిగ్రీలకు చేరుకుంటే జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. 41 నుంచి 46డిగ్రీలకు చేరుకుంటే అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. 46 డిగ్రీలకు పైబడి నమోదవుతే ప్రమాదాల హెచ్చరికలను వాతావరణ శాఖ అధికారులు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎల్లో జోన్ నుంచి ఆరెంజ్ జోన్‌లోకి చేరువగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్తున్న జనాలు జాగ్రత్తలు వహించాలని సూచిస్తున్నారు.

**గత వారం రోజుల్లో నమోదైన, కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు..**

| తేదీ | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| 24 | 24.0 | 35.0 |
| 25 | 24.3 | 38.0 |
| 26 | 23.8 | 37.9 |
| 27 | 23.4 | 38.2 |
| 28 | 24.6 | 39.2 |
| 29 | 25.2 | 39.2 |
| 30 | 25.6 | 40.0 |
| 31 | 25.4 | 40.0 |

# కుటుంబ పాలన అంతమొందించాలి

- కాంగ్రెస్‌తోనే మెరుగైన పాలన
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

బెల్లంపల్లిరూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పాలనను అంతమొందించాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని అన్నారు. 'భట్టి' చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర శుక్రవారం ఉదయం బెల్లంపల్లి పట్టణం ఏఎంసీ గ్రౌండ్ నుంచి ప్రారంభమై మండలంలోని పోశమ్మగడ్డ, లంబాడితండా, తాళ్లగురిజాల, బట్వాన్‌పల్లి, పెర్కపల్లి వరకు సాగింది. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం లిక్కర్ దందా తొమ్మిదేళ్లుగా యథేచ్ఛగా కొనసాగిస్తూ ప్రజలను మద్యంమత్తులో ముంచుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో విద్యకు పెద్దపీట వేసిందని, పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక చొరవ చూపిందని తెలిపారు. మిషన్ భగీరథ పథకాలు కేసీఆర్ జేబులు నింపడానికే తప్ప ప్రజలకు ఎలాంటి ఉపయోగం చేకూర్చడం లేదని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత ఢిల్లీ లిక్కర్‌స్కామ్‌పై, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సొంత ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని హామీనిచ్చారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, యూత్ కాంగ్రెస్ బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్‌వర్ధన్ రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, నాయకులు నాతరి స్వామి, కె.శ్రీనివాస్, మల్లేష్, కృష్ణ, బానయ్య, బక్కన్న, రాముగౌడ్ పాల్గొన్నారు.



విద్యార్థుల సమస్యలు వింటున్న భట్టి విక్రమార్క

**సమస్యలపై వినతులు**

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, లైబ్రరీ లేవని, అధ్యాపకుల కొరత ఉందని తెలిపారు.

**'రాష్ట్ర సంపదను బీఆర్ఎస్ దోచుకుంటోంది..'**

నెన్నెల: రాష్ట్ర సంపదను బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుంటోందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. శుక్రవారం రాత్రి నెన్నెల మండలం గుండ్లసోమారం, నార్వాయిపేట పాదయాత్ర కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షల పేపర్ లీకేజీతో నిరుద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.18 లక్షల కోట్ల నిధులను వృథా చేసిందని ఆరోపించారు. రాహుల్‌పై అనర్హత వేటు వేసిన బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపుదామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నెన్నెల మండలంలోని సీతానగర్ సర్వే నం.1లో ఉన్న 600 ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇస్తామన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు ప్రభుత్వ భూముల కబ్జాలపై ఉన్న ప్రేమ సమస్యలు తీర్చడంలో లేదన్నారు. కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ పాల్గొన్నారు.



గుండ్లసోమారంలో 'భట్టి' పాదయాత్ర

**నేడు పాదయాత్ర**

పాదయాత్ర శుక్రవారం నెన్నెల మండలం మెట్‌పల్లిలో ముగిసింది. రాత్రి మెట్‌పల్లిలోనే బస చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు మెట్‌పల్లి నుంచి యబలుదేరి చిత్తాపూర్, ఆవుడం, గంగారాం మీదుగా భీమారం మండలం కాజిపల్లి, నర్సింగాపూర్‌లలో కొనసాగుతుంది. నర్సింగాపూర్‌లో బస చేస్తారు.

# సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

లక్సెట్టిపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇంచార్జి నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్పీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి చెందిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, యువ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణ్‌రావు

# నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

మంచిర్యాలటౌన్: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కే.నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏడు స్థాయీ కమిటీ సమావేశాలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

## క్లుప్తంగా

### మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్


రాళ్లు రువ్వుతున్న మతిస్థిమితం లేని వ్యక్తి

దండేపల్లి: మండల కేంద్రంలో కొద్దిరోజులుగా తిరుగుతున్న ఓ మతి స్థిమితం లేని వ్యక్తి శుక్రవారం జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో బండరాళ్లు విసురుతూ హల్‌చల్ చేశాడు. అటుగా వెళ్లిన విద్యార్థులు, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా పిల్లలు పరుగులు తీశారు. కొద్దిసేపటి తర్వాత ఆ వ్యక్తి వెళ్లిపోగా వాహనదారులు ఊపిరి పీల్చుకుని ముందుకు కదిలారు. మతిస్థిమితం లేని వ్యక్తితో పిల్లలు పెద్దలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి అతడిని ఆస్పత్రికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

### సింగరేణి నేపథ్యంలో సినిమా


మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు, పక్కన డైరెక్టర్ అశోక్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి ఇతివృత్తంగా మంచిర్యాల జిల్లా పరిసర ప్రాంతాల్లోనే ఓ సినిమా నిర్మిస్తామని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ప్రముఖ నిర్మాత, బీఆర్‌ఎస్ నాయకుడు పుస్కూరి రామ్మోహన్‌రావు తెలిపారు. శుక్రవారం మంచిర్యాలలోని తన నివాసంలో డైరెక్టర్ జీ అశోక్‌తో కలిసి చిత్రానికి సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. సింగరేణి నేపథ్యంతో మంచిర్యాల పరిసర ప్రాంతాల్లోని ఓ సినిమా తీయాలనే ఆలోచనతో కథ సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. బొగ్గు గనుల సీన్ల షూటింగ్ నిమిత్తం శ్రీరాంపూర్ ఓసీపీ, పరిసర ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. వచ్చే రెండు నెలల్లో కొత్త సినిమా చిత్రీకరణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. దర్శకుడు అశోక్ గతంలో పిల్లజమీందార్, భాగమతి తదితర సినిమాలకు దర్శకత్వం వహించారని చెప్పారు.

### పేకాట స్థావరంపై దాడి

చెన్నూర్‌రూరల్: నాగాపూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. నాగాపూర్ శివారులో పేకాడుతున్నవారిని పట్టుకుని రూ.26,470 నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో ఎస్సై మహేందర్, సిబ్బంది రాజశేఖర్, భూమన్న, రవితో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు తెలిపారు.

### టీఎస్‌జీఆర్‌ఈఏ జిల్లా స్థాయి సమావేశం

మంచిర్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్‌ఈఏ) మంచిర్యాల జిల్లా స్థాయి మూడో కార్యవర్గ సమావేశాన్ని సంఘం అధ్యక్షుడు డీ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈహెచ్‌ఎస్‌కు సంబంధించి పెన్షనర్లకు కంట్రిబ్యూషన్ నిర్ణయించాలన్నారు. టీఎస్‌జీఆర్‌ఈఏ ప్రతినిధులతో కలుపుకొని కమిటీ ఏర్పాటు చేసి సాధ్యమైనంత తొందరగా అమలు జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే అమలు చేయాలన్నారు. రాష్ట్ర జాయింట్ స్టాఫ్‌కౌన్సిల్‌లో టీఎస్‌జీఆర్‌ఈఏ రాష్ట్ర బాధ్యులకు సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి జగన్ పాల్గొన్నారు.

# విజయం 'పది'లం చేసుకోండి


నెన్నెల హైస్కూల్‌లో తరగతిగదిలో చదువుతున్న విద్యార్థులు

- ఈ నెల 3వ తేదీ నుంచి ఎస్సెస్సీ పరీక్షలు
- హాజరుకానున్న 36,953 మంది విద్యార్థులు
- పౌష్టికాహారం, సరిపడా నిద్ర తప్పనిసరి.. భయం వీడాలంటున్న వైద్య నిపుణులు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మంచిర్యాల జిల్లాలో 10,125, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 7,051, నిర్మల్‌లో 9,078, ఆదిలాబాద్ జిల్లాలో 10,699 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షల వేళ విద్యార్థులు ఒత్తిడి.. భయం.. ఆందోళనను జయించాలంటే సానుకూలమైన ఆలోచనలు.. ప్రణాళిక బద్ధమైన సంసిద్ధత, ఆత్మవిశ్వాసం, విషయాన్ని సూటిగా స్పష్టంగా వ్యక్తీకరించడం అవసరం. మానసిక ప్రశాంతత.. ప్రణాళిక ప్రకారం సాధన చేయడం, మంచి ఆహారపు అలవాట్లు, సంపూర్ణ ఆరోగ్యంతో పరీక్షలకు సిద్ధమైతే విజయం సొంతమై లక్ష్యాన్ని చేరుకుంటారు. ఈనేపథ్యంలో వైద్యులు, పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

### భయం వీడి పరీక్ష రాయండి



తల్లిదండ్రులు పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. పిల్లలను టీవీలకు దూరంగా ఉంచాలి. విద్యార్థులు భయం వీడి పరీక్ష రాయాలి. సంవత్సరం పాటు నేర్చుకున్న విషయాలను మాత్రమే సమాధాన పత్రంలో రాస్తామన్న భావనతో ఉండాలి. ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా పరీక్షలకు హాజరు కావాలి. నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకుంటే మంచిది.

– ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

### సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పరీక్ష కేంద్రం లోపలికి వెళ్లిన దగ్గరి నుంచి పరీక్ష రాసి తిరిగి వచ్చేవరకూ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఒకటికి రెండుసార్లు ఆలోచించి ప్రశ్నలకు జవాబులు రాయాలి. పరీక్షల వేళ టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి. పిల్లలు ఏమి చదువుతున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాలి.

– బాపు, పేరెంట్

### ఆహారం విషయంలో నిర్లక్ష్యం వద్దు



పరీక్షల ధ్యాసలో పడి ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేయరాదు. కూరగాయలు, పప్పుదినుసులు, పాలు, ఆకుకూరలు, పీచు పదార్థాలు ఉండే పండ్లు తినాలి. కాఫీలు, కూల్‌డ్రింక్స్, తేనీరు ఎక్కువగా తీసుకోకూడదు. రోజుకు 8గంటల నిద్రపోవడం ఎంతో ముఖ్యం. ఆయిల్, మసాలతో కూడిన ఆహారం తినరాదు. మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, బట్టర్‌మిల్క్ తీసుకోవాలి. రోజుకు 4–5 లీటర్ల నీళ్లు తాగాలి. వదులుగా ఉండే లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి.

– డాక్టర్ రవికుమార్, జనరల్ ఫిజీషియన్ (ఎండీ)

### ఒత్తిడిని జయించేందుకు భరోసానివ్వాలి



పరీక్షలు అనగానే విద్యార్థులు ఒత్తిడికి లోనవుతుంటారు. ధ్యానం, యోగా చేయాలి. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండాలి. విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భరోసా కల్పించాలి. స్థాయికి మించిన అంచనాలు పక్కన పెట్టాలి. సానుకూల దృక్పథం కలిగి ఉండాలి. భావోద్వేగాలకు దూరంగా ఉండాలి. ఫలితాలతో సంబంధం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాస్తే లక్ష్యం చేరుకుంటారు.

– డాక్టర్, సునీల్‌కుమార్, మానసిక వైద్యనిపుణుడు

### పుస్తకాన్ని సరైన ఎత్తులో ఉంచి చదవాలి



మెడ, నరాల నొప్పి రాకుండా ఉండేందుకు విద్యార్థులు పుస్తకాలను సరైనా ఎత్తులో పెట్టి చదువుకోవాలి. ఒత్తిడికి లోనుకావద్దు. ఎక్కువ సేపు చదవడం, నిద్రలేమి కారణాలతో ఆరోగ్యం దెబ్బతింటుంది. మొబైల్ అతి వినియోగం మానుకోవాలి. చదువు మధ్యలో షార్ట్ బ్రేక్ ఇవ్వాలి. రోజూ వాకింగ్, వ్యాయామం చేయాలి. పుస్తకాన్ని తలకు సరైన ఎత్తులో పెట్టుకుని చదువుకోవాలి. సరైన నీరు, పోషకాహారం తీసుకోవాలి.

– వీ అరుణ్‌శేషు, న్యూరాలజిస్ట్, మంచిర్యాల

### ప్రశాంతంగా చదువుకోవాలి



పరీక్షలు ఏవైనా విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేలా తల్లిదండ్రులు సహకరించాలి. పరీక్షల సమయంలో స్నాక్స్, రాగిజావ అందించాలి. ఒత్తిడికి గురైతే చదివింది కూడా మరిచిపోయే అవకాశం ఉంటుంది. ఇతర పిల్లలతో తమ పిల్లలను పోల్చడం మానుకోవాలి. విద్యార్థులకు పరీక్షలప్పుడు ఏమి కావాలో తెలుసుకుంటూ వాళ్ల అవసరాలను తీరుస్తుండాలి.

– బండి మధుకర్, పేరెంట్, పొక్కూర్

### మందమర్రి ఏరియా జీఎంగా మోహన్‌రెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఇద్దరు జీఎంలను బదిలీ చేస్తూ జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) ఏ.కుమార్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్జీ–1 ఏరియా జీఎం కలువల నారాయణ ఉద్యోగ విరమణ పొందడంతో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్‌గా చింతల శ్రీనివాస్‌ను ఆర్జీ–1 ఏరియా జీఎంగా బదిలీ చేశారు. అలాగే, ఆర్జీ–ఓసీ–3లో ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న జి.మోహన్‌రెడ్డిని పదోన్నతిపై మందమర్రి ఏరియా జీఎంగా నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని ఈజ్‌గాం గ్రామానికి చెందిన అనాత్‌దాస్ (58) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనాత్‌దాస్ కొద్దికాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విలేజ్ నంబర్–13లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు షానుదాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక భగవంతంవాడకు చెందిన తోట రాయలింగు (66) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రోజులాగే శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన రాయలింగు తిరిగి సాయంత్రమైనా ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. ఈక్రమంలో మంచిర్యాల శివారులో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే అధికారుల నుంచి సమాచారం అందగా వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. మృతుడి కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

## 'కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీజేపీ కుట్ర'


మాట్లాడుతున్న బలరాంనాయక్, పక్కన ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో ప్రజల్లోకి వెళ్తుండడం చూసి అడ్డుకునేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తోందని, ఇందులో భాగంగానే రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిందని కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సూరత్ న్యాయస్థానం ఇచ్చిన తీర్పునకు 30 రోజుల గడువు ఉన్నప్పటికీ 24 గంటల్లోపే ఆయనపై బీజేపీ ప్రభుత్వం వేటు వేయడం సరికాదన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలని కాంగ్రెస్ నాయకులు కోరినా సోనియాగాంధీ మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ఎంతోమంది అడ్డుపడినా, ఈ ప్రాంత కాంగ్రెస్ నేతలతో సమాలోచనలు చేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆమోదం తెలిపారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలోనే సమాచార హక్కు చట్టం, పోడు భూములు, పంటరుణాల మాఫీ, జాతీయ రహదారులు, ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటు, ఏకలవ్య, నవోదయ పాఠశాలల ఏర్పాటు తదితర కార్యక్రమాలు, పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, నాయకులు చిట్ల సత్యనారాయణ, కొండ చంద్రశేఖర్, తూముల నరేశ్, హేమలత, వేములపల్లి సంజీవ్, సల్ల మహేశ్, భీమయ్య పాల్గొన్నారు.

## ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి


ఏవోకు వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

పాతమంచిర్యాల: ఐకేపీలో పని చేస్తున్న తమను ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏలు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం జిల్లా నాయకురాలు రమాదేవి మాట్లాడారు. 20 ఏళ్లుగా ఐకేపీలో చాలీచాలని గౌరవ వేతనంతో పని చేస్తు మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రజల్లోకి చేరేలా పని చేస్తున్నామన్నారు. ఇన్ని చేసినా ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తంజేశారు. కనీస వేతనం ఇవ్వకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా టార్గెట్ పేరిట మానసిక ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోయారు. విధి నిర్వహణలో తమకు ఏదైన ప్రమాదం జరిగితే పట్టించుకునేవారే లేరని, వేతనాలు పెంచకపోవడంతో తమ కుటుంబాల పోషణ భారంగా మారిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వీవోఏలు కుంటాల కుమార్, దుర్గం రాములు, వెంకటేశ్, శారద, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## రామమందిర్ నిర్మాణానికి 'మహా' కలప


అల్లపల్లిలో రామమందిర్ నిర్మాణానికి సిద్ధమవుతున్న కలప

కోటపల్లి: అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిర్ నిర్మాణానికి మహారాష్ట్ర కలపను అధికశాతం వాడుతున్నారు. మహారాష్ట్ర కలప నాణ్యతతో దృఢంగా ఉండడంతో ప్రధాన ద్వారం, కిటికీలు, తలుపుల నిర్మాణానికి వినియోగిస్తున్నారు. మహారాష్ట్రలోని అల్లపల్లి గ్రామంలో ప్రధాన ద్వారాలు, తలుపులు, కిటికీలు తయారు చేస్తున్నట్లు అక్కడి ఫారెస్ట్ అధికారులు తెలిపారు. నియమనిష్టలతో తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఆశ్రమ పాఠశాలలోకి ఆకతాయిలు

కోటపల్లి: గుర్తు తెలియని వ్యక్తులు గోడ దూకి కోటపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోకి ప్రవేశించడం కలకలం సృష్టించింది. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే పాఠశాల ఉండగా రెండురోజుల క్రితం ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. రాత్రి 11 తర్వాత ప్రవేశించిన వ్యక్తులు తరగతి గది తలుపులు కొట్టగా విద్యార్థినులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వారంతా మూకుమ్మడిగా బయటికి రాగా ఆకతాయిలు పారిపోయారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్థానికంగా ఉండక పోవడం, వాచ్‌మన్ పర్యవేక్షణ సరిగా లేక పోవడంతో ఆకతాయిలు లోనికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. విషయం తెలిసి విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. కోటపల్లి ఎస్సై వెంకట్ పాఠశాలకు వచ్చి విద్యార్థినులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కాగా, పాఠశాలలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సీసీ కెమెరాలు రెండేళ్లుగా పనిచేయడం లేదు. మండలకేంద్రంలోనే బాలికల వసతి గృహాలుండగా రాత్రివేళ పోలీసుల పర్యవేక్షణ లేక ఈ ఘటన జరిగినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణను వివరణ కోరగా.. ఆకతాయిలు వచ్చిన సమయంలో తాను పాఠశాలలో లేనని చెప్పారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు ద్వారా విషయం తెలుసుకుని ఎస్సైకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌రూరల్: పురుగులమందు తాగి యువతి ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతుగూడ గ్రామానికి చెందిన ఇర్దండి శ్రీదేవి (19) శుక్రవారం రాత్రి 9గంటలకు మరుగుదొడ్డిలోకి వెళ్లింది. ఎంతసేపైనా తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి గమనించగా పురుగులమందు తాగి పడి ఉంది. వెంటనే వారు మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు మృతురాలి తండ్రి మనోహర్ పేర్కొన్నారు. కాగా, శ్రీదేవి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## పశువైద్యశాలలో ఆకస్మిక తనిఖీ


పశువైద్యశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న రమేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల ప్రాథమిక పశువైద్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా పశువైద్యాధికారి వై.రమేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రం ద్వారా అందించిన సేవలు, టీకాలు, నట్టల నివారణ మందు, గడ్డి విత్తనాల వివరాలకు సంబంధించి రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీపీఆర్ టీకాల కార్యక్రమం త్వరలో ప్రారంభం కానున్నందున జిల్లా స్టోర్స్ నుంచి పీపీఆర్ టీకాలు తెప్పించుకోవాలని సూచించారు. ఆయా మండలాల పరిధిలోని పశువైద్య కేంద్రాల్లో రైతులకు సబ్సిడీపై అందుబాటులో ఉంచిన గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవిలో పశువులకు ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. హాజీపూర్ మండల పశువైద్యాధికారి శాంతిరేఖ, ఆఫీస్ సబార్డినేట్ నారాయణ ఉన్నారు.



## కాంగ్రెస్ బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన


నస్పూర్‌లో సభాస్థలిని పరిశీలిస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

నస్పూర్: హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అసెంబ్లీ ఫ్లోర్‌లీడర్ భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర త్వరలో మంచిర్యాల నియోజకవర్గంలోకి ప్రవేశించనుంది. ఈ సందర్భంగా నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఏప్రిల్ మొదటి వారంలో నిర్వహించనున్న బహిరంగసభ స్థలాన్ని ఏఐసీసీ మాజీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సురిమిల్ల వేణు, పట్టణాధ్యక్షుడు బండారి సుధాకర్, నాయకుడు శీపతి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

భీమారంలో..

భీమారం: మండలంలోని దాంపూర్‌లో శనివారం రాత్రి సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్క పర్యటన ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి, సభ్యుడు నూకల రమేశ్ తెలిపారు. శుక్రవారం దాంపూర్‌లో కార్యక్రమం నిర్వహించనున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యాత్రను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, లక్ష్మణ్, చేగొండ రవి పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉపకేంద్రాల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న సీహెచ్‌వో

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పలు ఏరియాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను శుక్రవారం మంచిర్యాల డివిజన్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల గురించి సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. పలు కేంద్రాల్లో నీటి వసతి లేకపోవడంతో ఉప కేంద్రాలకు వచ్చే వారికి ఇబ్బంది కలుగుతోందని, వసతుల కల్పనకు కృషి చేయాలని సిబ్బంది సూచించారు. సామాజిక ఆరోగ్య అధికారి రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, వైద్యాధికారి పద్మశ్రీ, ఏఎన్‌ఎం సంధ్యారాణి, అనిత, జ్యోతి, సీహెచ్‌వో గంగాధర్ ఉన్నారు.

## బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ కోరారు. శుక్రవారం తపస్ సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎనిమిది సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు, ఐదు సంవత్సరాలుగా బదిలీలు లేవన్నారు. ఉపాధ్యాయుల 12 నెలల పీఆర్సీ ఎరియర్స్‌కు సంబంధించి ఇంతవరకు మూడు నెలలు మాత్రమే క్రెడిట్ అయ్యాయని, మిగతా 9 నెలల ఎరియర్స్ జమకాలేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు సంవత్సరం తరబడి విడుదల కాలేదన్నారు. చివరకు పెన్షనర్ల రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్‌లో జాప్యం జరుగుతోందని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, రవికుమార్, జిల్లా బాధ్యులు నీలేశ్‌కుమార్, రాజ్‌కుమార్, రమణయ్య, సత్తిరెడ్డి, రూపాచారి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.